క్లుప్తంగా

న్యాయమైన హక్కుల సాధనకు పోరాటం


మాట్లాడుతున్న గోడం గణేశ్

ఇంద్రవెల్లి: తొమ్మిది తెగల ఆదివాసీల సమస్యలు, వారి న్యాయమైన హక్కుల సాధనకు పోరాటం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఉట్నూర్, బోథ్, ఆదిలాబాద్ డివిజన్, మండల తొమ్మిది తెగల ఆదివాసీలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదివాసీ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. మహిళలు, గర్భిణుల్లో పౌష్టికాహారం లోపాన్ని గుర్తించి వారికి పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సమాచార హక్కు చట్టాన్ని కొందరు దుర్వినియోగం చేయడాన్ని తుడుందెబ్బ ఖండిస్తుందన్నారు. అనంతరం ఉట్నూర్, బోథ్, ఆదిలాబాద్ డివిజన్ల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పెందోర్ జలపతి, కొడప నగేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉయిక సుదర్శన్, కుడ్మెత తిరుపతి, జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నైతం రమేశ్, తుడుందెబ్బ నాయకులు రామెల్లి భోజన్న పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు


వ్రతంలో పాల్గొన్న పలువురి జంటలు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయం(మంగమఠం)లో పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు జంటలు పాల్గొన్నారు. అర్చకుడు వైభవ్ దుబే ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

విఠల్ రుక్మాబాయి ఆలయంలో పూజలు


ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే

నేరడిగొండ: మహారాష్ట్రలోని పండర్‌పూర్ విఠల్ రుక్మాబాయి ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మండలంలో గురువారం నుంచి గ్రామసభలు ప్రారంభం కానున్నాయి. 28న కచికంటి, చిట్యాల్‌బోరి, పొచ్చర, దిమ్మ, లాండసాంగ్వి, అర్లి (బి), 29న బూర్నూర్, యశ్వంత్‌గూడ, పెద్ద మలేబోరిగాం, చించుఘాట్, మామడిగూడ, జంబుల్‌ధరి, 30న అసోదా, లోకారి, వాన్‌వాట్, లింగుగూడ, పిప్పల్‌ధరి, జనవరి 2న చాందా (టి), అంకోలి, యాపల్‌గూడ, 3న తంతోలి, భీంసరి, జందాపూర్, 4న ఖండాల, లోహర, హత్తిగుట్ట, తిప్ప, చిచ్‌ధరి, 5న ఖానాపూర్, అల్లికోరీ, రామాయి, 6న అంకాపూర్, కుంబఝరి, న్యూరాంపూర్ గ్రామాల్లో నిర్వహించనున్నారు. వీటిని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనున్నాయి. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో సమావేశ మందిరంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలకు బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

1 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఇచ్చోడ: మండలకేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో జనవరి 1 నుంచి 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు నిమ్మల మల్లేశ్‌రెడ్డి, అనురాజ్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రెండోరోజు పూజా కార్యక్రమాలు, చివరిరోజు మహాభిషేకం, అమ్మపాదుకలతో పల్లకీ ఊరేగింపు, తర్వాత అన్నదానం ఉంటుందని వివరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శ్రీరామమందిర నిర్మాణం దశాబ్దాల కల

- మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి


అక్షింతల శోభాయాత్రలో యోగానంద సరస్వతి స్వామి

ఆదిలాబాద్: అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం అనేది హిందువుల దశాబ్దాల కల అని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి అన్నారు. అయోధ్యలో భవ్య శ్రీరామ మందిర నిర్మాణానికి సంబంధించి జనవరి 22న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శ్రీరాముని సన్నిధి నుంచి తీసుకువచ్చిన అక్షింతలను కళశాలలో నింపి, పూజల అనంతరం శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ భవ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రజలందరికీ శ్రీరాముడి ఆశీస్సులు అందించేలా శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఊరూరా అక్షింతల పంపిణీ చేపట్టిందన్నారు. ఇంటింటికి చేరిన అక్షింతలను భక్తులు రాముడి ఆశీస్సులుగా భావించి దీవెనలు పొందాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోండ్ల నారాయణ, విభాగ్ కార్యదర్శి తమ్మల క్రిష్ణ, బజరంగ్ దళ్ ప్రముఖ్ బండారి సంతోష్, దత్తాత్రేయ, దిలీప్, ప్రశాంత్, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధి ఉపంచి క్రిష్ణ పాల్గొన్నారు.

అక్షింతల స్వాగతోత్సవ ర్యాలీ

బేల: మండలకేంద్రంలో వీహెచ్‌పీ, శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అయోధ్య శ్రీరామాలయ అక్షింతల స్వాగోత్సవ శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి సార్వజనిక్ హనుమాన్ ఆలయ మార్గంలో ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీని భజన కీర్తనల మధ్యన కొనసాగించి, అశోక్‌నగర్ కాలనీలోని హన్మాన్ ఆలయానికి తీసుకెళ్లారు. తీర్థ ట్రస్ట్ మండల ఇన్‌చార్జి గుండవార్ శ్రీనివాస్, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు బెదుర్కర్ ప్రఫుల్ మాట్లాడుతూ వచ్చే నెల రెండో తేది నుంచి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేస్తామన్నారు. ఎంపీటీసీ ఓల్లఫ్‌వార్ జ్యోతి, ట్రస్ట్ సభ్యులు బర్కాడే రాము, ఉప్పలవార్ నారాయణ, పొల్కట్ బాలాజీ, మాడవార్ హరీశ్‌రెడ్డి, పోత్రాజ్ నవీన్, ముక్కవార్ సురేష్, రవి, అవినాష్ పాల్గొన్నారు.

బోథ్‌కు చేరిన శ్రీరాముని తలంబ్రాలు

బోథ్: అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయిన సందర్భంగా తీర్థక్షేత్ర ట్రస్టు దేశవ్యాప్తంగా ఆయా గ్రామాలకు శ్రీరాముని తలంబ్రాలను పంపింది. ఇందులో భాగంగా మంగళవారం బోథ్‌కు చేరుకున్నాయి. బస్టాండ్ నుంచి తలంబ్రాలతో భక్తులు మండలకేంద్రంలో శోభాయాత్ర చేపట్టారు. ఇంటింటికీ అందజేస్తామని వీహెచ్‌పీ నాయకులు తెలిపారు.

జైనథ్‌కు చేరిన అక్షింతలు

జైనథ్: అయోధ్య నుంచి రామాలయ అక్షింతలను ఆదిలాబాద్ వీహెచ్‌పీ కార్యాలయం నుంచి జైనథ్‌కు చేరుకున్నాయి. పూంద్రు అశోక్ రెడ్డి, నూకల పెద్ద లస్మన్న, ప్రతాప్ యాదవ్, చిల్కూరి లింగారెడ్డి తదితరులు ఈ అక్షింతలను గ్రామంలో మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. ప్రాచీన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, అక్షింతలను ఆలయంలో ఉంచారు.


అక్షింతలను తీసుకొని వస్తున్న పూంద్రు అశోక్‌రెడ్డి


స్వాగతోత్సవ శోభాయాత్ర ర్యాలీ


బోథ్‌లో తలంబ్రాలతో శోభాయాత్ర

పూలాజీబాబా బాటలో నడవాలి


ఉట్నూర్‌రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: సద్గురు పూలాజీబాబా చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని అంజి గ్రామంలో పూలాజీబాబా ధ్యానకేంద్రంలో 34వ వార్షికోత్సవానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. ముందుగా పూలాజీబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పూలాజీబాబా సూచించిన భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆంద్ ఆదివాసీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పట్నాపూర్ పూలాజీబాబా సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్, అంజీ ధ్యాన్ కేంద్రం అధ్యక్షుడు గారుశే దశరథ్, సర్పంచ్ గారుశే కుస్మబాయి, ఆంద్ ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడే కైలాస్, జిల్లా అధ్యక్షుడు ముఖడే విష్ణు, ఆంద్ ఆదివాసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరడే మారుతి, కాంగ్రెస్ నాయకులు ముఖడే ఉత్తం, మిర్జ యకుబ్ బేగ్, పవార్ దుదిరాంనాయక్, సోమోరే నాగోరావ్, జితేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

సిరికొండ: చెడు అలవాట్లకు దూరంగా ఉండి ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని రాజంపేట్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన అఖండ హరినామసప్తాతోపాటు ఆంజనేయస్వామి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన గ్రామం రాజంపేట్‌ను ఆదర్శంగా తీసుకుని మద్యం, మాంసం, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మండలంలో ఉన్న ప్రధాన సమస్యలు వాయిపేట్ రోడ్డు, చిక్‌మాన్ ప్రాజెక్టు రీడిజైన్, కొండాపూర్ వంతెన పనులు త్వరలోనే అధిష్ఠానంతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా మండలానికి విచ్చేసిన ఆయన్ను నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు. మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, ఎంపీపీ పెందూర్ అమృత్‌రావు, రిమ్మ, కన్నాపూర్ సర్పంచ్ పెందూర్ అనిల్‌కుమార్, కుంరం రఘురాం, ఆదివాసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాండు, అమృత్, షేక్ బషీర్, షేక్ రంజాన్, రాజరాం, రాథోడ్ బిక్కు, రాజంపేట్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఉట్నూర్‌రూరల్: ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో ఎదుర్కొంటున్న భూ సమస్యలతోపాటు ఇళ్లకేటాయించాలని, సోషల్ వెల్ఫేర్ బాలికల, బాలుర వసతిగృహాలు మంజూరు చేయాలని వారు కోరారు. నిర్వాహకులు దాసండ్ల భూమన్న, బండి విజయ్‌కుమార్, బొంకంటి సుభాష్, ప్రజ్ఞశీల్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జగ్జీవన్, జాడి లింగన్న, ఆశన్న, చంద్రయ్య, జక్రయ్య, ఆశన్న, బాపురావ్, రాజారావ్, రామారావు, రాంకిషన్ నాయక్, కపిల్ పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలు


తాంసి: గోట్కూరిలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: సీపీఐ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ కేంద్రంగా పార్టీ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి వరకు పేదల పక్షాల నిలుస్తూ వారి సంక్షేమం, హక్కుల కోసం ఉద్యమిస్తుందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందన్నారు. పార్టీ నాయకులు అరుణ్ కుమార్, పాషా, అమీనా, తదితరులు పాల్గొన్నారు.


ఎదులాపురం: కేక్ కట్ చేస్తున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

బోథ్: బోథ్ బస్టాండ్ వద్ద సీపీఐ జెండాను నాయకులు ఆవిష్కరించారు. నాయకులు బి.గోవర్ధన్, షేక్ షాకీర్, నరేశ్, ప్రేమ్‌సింగ్ రాథోడ్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

తాంసి: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ పార్టీ పోరాటాలు చేస్తోందని జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ అన్నారు. మండలంలోని గోట్కూరి గ్రామంలో మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద నాయకులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో దేవేందర్ మాట్లాడారు. జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ తరపున ఉద్యమాలు చేస్తామని తెలిపారు. నాయకులు చంద్రమౌళి, దేవిదాస్, కుంటాల రాములు, కట్టా స్వామి, క్రిష్ణ, భాస్కర్, గంగారెడ్డి, కిష్టప్ప, కేశవ్ పాల్గొన్నారు.


బోథ్: జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఘనంగా దత్త జయంతి

- ఆలయాల్లో భక్తుల పూజలు


తాంసి: పూజలు చేస్తున్న మాజీ ఎంపీ నగేశ్


గుడిహత్నూర్: కీర్తనలో పాల్గొన్న భక్తులు


తలమడుగు: మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని బజర్‌గల్లి సాయి దత్త ఆలయంలో సాయిదత్త జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, హనుమన్‌నగర్, భీంనగర్‌లో పల్లకీ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

తలమడుగు: సాయిలింగి గ్రామంలో సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవం నిర్వహించారు. మూడు రోజులపాటు వేద పండితులు యజ్ఞం కార్యక్రమాలు జరిపించారు. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, విజయ డైరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకన్న యాదవ్, రమేశ్‌రెడ్డి, సర్పంచులు పోచ్చన్న, కరుణాకర్‌రెడ్డిలు ఆలయంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బోథ్: మండల కేంద్రంతోపాటు కొత, పొచ్చర, కుచులాపూర్‌తోపాటు గ్రామాల్లోని శబరిమాత ఆలయాల్లో దత్త జయంతిని నిర్వహించారు. కనుగుట్టలో మహార్ నుంచి వచ్చిన పలువురు గోమాతకు పూజలు చేశారు.

గుడిహత్నూర్: ఉమ్రి (బి) పంచాయతీలోని రాం మందిర్ వద్ద చేపట్టిన జాతరను రాంమందిర ఆలయ సేవకుడు శాస్త్రీ మహారాజ్ ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మూడురోజుల పాటు జాతర కొనసాగనుంది. కొల్హారీ గ్రామస్తులు అన్నదానం చేశారు.


తలమడుగు: సాయిబాబా ఆలయంలో


నేరడిగొండ: కుమారి గ్రామంలో..

తాంసి: గిరిగాం గ్రామంలో దత్తాత్రేయ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పండితులు ఆంజనేయులు, పరమేశ్వరయ్య ఆధ్వర్యంలో రెండు రోజులుగా గణపతి పూజ, నవగ్రహపూజ, హోమం పూజ కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎంపీ గొడం నగేశ్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ రాజు, సర్పంచ్ గజానన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, అరుణ్, రజనీకాంత్, కృష్ణ, పరమేశ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని గాయత్రినగర్‌లోని చైతన్య రామగిరి దత్తాసాయి మందిరంతోపాటు వడూర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద, కుమారి గ్రామంలో శబరిమాత ఆశ్రమం వద్ద వేడుకలు నిర్వహించారు. గ్రామాల్లో పల్లకీ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి శిష్యులను వడూర్ గ్రామస్తులు సన్మానించారు.


బోథ్: ఆవుకు పూజ చేస్తున్న భక్తులు

పరామర్శ

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన పలు ఘటనల్లో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను కాంగ్రెస్ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఒంటిపై ఆయిల్ పడి గాయపడిన కేఆర్‌కే కాలనీకి చెందిన అశోక్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దిలీప్ కూతురు అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన రిమ్స్‌కు వెళ్లి వారిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.


చిన్నారిని పరామర్శిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలి


భూమిపూజ చేస్తున్న గణేశ్‌నాయుడు, తదితరులు

ఆదిలాబాద్: సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని గజేందర్‌నాయుడు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గణేశ్‌నాయుడు కోరారు. జిల్లాకేంద్రంలోని బంగారిగూడ కాలనీలో మంగళవారం శ్రీ అభయాంజనేయస్వామి 21 అడుగుల విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కౌన్సిలర్ శ్రీనివాస్, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు సురేష్, శ్రీనివాస్, రాకేశ్, సంతోష్, సుభాష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

గుడిహత్నూర్: మండలంలోని డోంగర్‌గావ్‌కు చెందిన దోమకొండ సుధాకర్ ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. కొల్హారీ గ్రామ సర్పంచ్ దంపతులు గిత్తే కల్పన గజానంద్‌లు బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం నూతన వస్త్రాలు అందించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు.


నూతన వస్త్రాలు అందజేస్తున్న సర్పంచ్ దంపతులు

నిరుపయోగంగా..

నార్నూర్: నార్నూర్ సీహెచ్‌సీ 30 పడకల ఆస్పత్రిలో వైద్య పరికరాలు నిరుపయోగంగా మారాయి. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన స్కానింగ్ మిషన్, బాయ్‌లిస్ మిషన్, కు.ని ఆపరేషన్ బెడ్, ఏసీ పరికరాలు మూలనపడి దర్శనమిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008లో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.3 కోట్లతో భవనాన్ని నిర్మించగా, రెండేళ్ల క్రితం అప్పటి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఇప్పటివరకు వైద్యులు నియమించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. వైద్యం కోసం ఉట్నూర్, ఆదిలాబాద్ రిమ్స్‌కు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి వైద్యులు నియమించడంతోపాటు ఆస్పత్రిలో వైద్యపరికరాలు ఉపయోగంలోకి తేవాలని పలువురు గిరిజనులు, రోగులు కోరుతున్నారు.


నిరుపయోగంగా బాయ్‌లిస్ మిషన్


నిరుపయోగంగా ఏసీ పరికరాలు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం

నార్నూర్ సీహెచ్‌సీ వైద్యవిధాన పరిషత్ పరిధిలో వస్తోంది. వైద్యుల నియామకానికి, ఆస్పత్రిలో పరికరాలు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.
– కుమ్రం బాలు, ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి, ఉట్నూర్

మనిషి సహజత్వాన్ని వీడొద్దు

ఆదిలాబాద్: వినాశకర పోకడలతో వచ్చే పరిణామాలతో మనిషి తనలోని సహజత్వాన్ని వీడకూడదని ఆల్‌ఇండియా రేడియో రిటైర్డ్ ఆఫీసర్ సుమనస్పతిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో జిల్లాకు చెందిన రచయిత డాక్టర్ ఉదారి నారాయణ రచించిన మళ్లీ మనిషిలోకి పుస్తక పరిచయ సభకు మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల జీవన విధానంపై ప్రకృతి, కుటుంబం అనేవి ఎంతగానో ప్రభావితం చేస్తాయన్నారు. చిన్నారులు సంస్కృతి, సంప్రదాయాలు అలవర్చుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. ప్రముఖ కవి గోపగాని రవీందర్, మాజీ జెడ్పీటీసీ బొల్లరం బాబన్న, లెక్చరర్ నర్సింగ్, దేవిదాస్ దేశ్‌పాండే, తొడసం చందు, రిజ్వాన్ పాల్గొన్నారు.